క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

కాకినాడ: వార్షిక మరమ్మతుల దృష్ట్యా జగన్నాథపురంలోని అన్నమఘాటీ విద్యుత్ ఉపకేంద్రంలో మంగళవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని పురంవారివీధి, నర్సింహారోడ్డు, శివాలయంవీధి, తారకరామానగర్, కొవ్వూరు రోడ్డు, సుందర నగర్, పప్పుల మిల్లు ఏరియా, రిక్షాలపేట, పరదేశమ్మపేట, ప్రసాదరావునగర్, సత్యదేవినగర్‌లలో విద్యుత్ సరఫరాకు ఉండదన్నారు.

పశుబీమా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: స్థానిక కలెక్టరేట్‌లో వైఎస్సార్ పశుబీమా పథకం పోస్టర్‌ను కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం ఆవిష్కరించారు. ప్రభుత్వం పశువులకు పశు సంవర్ధక శాఖ ద్వారా పశు బీమా పథకం అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఈ బీమాపై అవగాహన కల్పించేందుకు వీలుగా బీమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జేసీ ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎస్.సూర్య ప్రకాశరరావు, జెడ్పీ సీఈవో ఏ రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళికతోనే ఉద్యోగావకాశాలు

కాకినాడ రూరల్: విద్యార్థి దశలోనే ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే ఉద్యోగావకాశాలు లభిస్తాయని హైదరాబాద్‌కు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్(ఐపీఈ) అధ్యాపకులు డాక్టరు విజయ్‌కుమార్, డాక్టరు ఎంవీవీ నయీమ్ తెలిపారు. ఉద్యోగావకాశాలను ఏ విధంగా సాధించాలి, ఆ ప్రణాళికను ఏ విధంగా సిద్ధం చేసుకోవాలి అనే అంశంపై అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో సోమవారం నిర్వహించిన సదస్సులో వారు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కమల్ కుమారి అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో విజయ్‌కుమార్, నయీమ్‌లు వివిధ సంస్థలో ఉద్యోగావకాలతో పాటు బిజినెస్‌ల్లో అవకాశాలను వివరించారు.

చర్చి అక్రమ నిర్మాణాన్ని ఆపాలంటూ ఫిర్యాదు

కరప: ఎటువంటి అనుమతులు తీసుకోకుండా చేపట్టిన చర్చి నిర్మాణ పనులను ఆపాలంటూ కూరాడ గ్రామస్తులు ఎంపీడీఓ కె.అప్పారావుకు ఫిర్యాదు చేశారు. కూరాడలో నాలుగో వార్డులో చర్చి నిర్మాణం చేస్తున్నారని, పంచాయతీ నుంచి కానీ, ఇతర అధికారుల నుంచి కానీ ఎటువంటి అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తున్నారని, సదరు చర్చి వల్ల పరిసర ప్రాంతాల్లోని గృహాల వారికి ఇబ్బందిగా ఉంటుందని, ఆ నిర్మాణాన్ని ఆపాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కూరాడ గ్రామస్తులు వెలుగుబంట్ల శ్రీనివాస్, కె.వెంకట్రాజు, కె.గంగరాజు, ఆర్.శివ, వి.శ్రీదేవి, వి.సూర్యావతి తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

రోటరీ సేవా కార్యక్రమాలు

బోట్‌క్లబ్: ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహణకు అంతర్జాతీయ రోటరీ విశేష కృషి చేస్తోందని రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్‌రావు అన్నారు. ఫౌండేషన్‌కు అందించే విరాళాల ద్వారా ప్రత్యేక సభ్యత్వ గుర్తింపు పత్రాన్ని కూడా అందిస్తుందని, ప్రపంచ వ్యాప్తంగా ఈ సభ్యత్వానికి ఎంతో గౌరవం ఉంటుందన్నారు. క్లబ్ సభ్యులు మాజీ కార్పొరేటర్ కోరుమిల్లి బాల ప్రసాద్‌కు రోటరీ వ్యవస్థాపకులు పాల్‌పి హారిస్ పేరిట అందించే సభ్యత్వ పత్రంతో పాటు ప్రత్యేక పిన్ను ఎస్‌వీఎస్‌రావు సోమవారం రోటరీ క్లబ్‌లో అందించారు. రోటరీ గోల్డెన్‌జూబ్లీలో చాలా మంది సభ్యులు పాల్‌హారిస్ సభ్యత్వం కలిగి ఉండడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ గోల్డెన్‌జూబ్లీక్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణ ప్రకాష్, క్లబ్ కార్యదర్శి వద్దాది ఆదిత్య, సభ్యులు టీవీ బాలకృష్ణ, చార్మినార్ వర్మ, మాచారెడ్డి, చిరంజీవిరెడ్డి, ఎస్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



నాగజ్యోతిని అభినందిస్తున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: ఏపీ పీజీఈసెట్‌లో రాష్ట్రస్థాయి 6వ ర్యాంక్ సాధించిన ఆదర్శ ఫార్మసీ కళాశాల ఆఖరి సంవత్సర విద్యార్థి సీహెచ్ కుసుమ నాగజ్యోతిని సోమవారం జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు అభినందించారు. మీ లక్ష్యంపై మీ పూర్తి దృష్టితో ఉంటే సత్వరమే చేరుకుంటారని వీసీ ప్రసంసించారు. విద్యార్థి కుసుమ నాగజ్యోతిను కళాశాల చైర్మన్ పి.కనకరాజు, డైరెక్టర్ ప్రవల్లిక, ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాథ్, శ్రీనివాస్ అభినందించారు.

పంప్‌హౌస్ పనుల పరిశీలన

కాకినాడ: స్థానిక వార్ఫురోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న పంపుహౌస్ నిర్మాణ పనులను నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల సోమవారం పరిశీలించారు. వర్షాలు వచ్చేలోపుగా నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అక్కడున్న అధికారులను ఆదేశించారు.

కాలువవలిలా.. నీరు సాగేదెలా..

- పెరిగిన గుర్రపుడెక్క
- పొలాలు ముంపు బారిన పడే ప్రమాదం
- తొలగించాలని రైతుల వినతి



పెదకొత్తూరు సమీపంలో కూరాడ డ్రెయిన్‌లో పెరిగిన గుర్రపుడెక్క



శహపురం డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, తూటుకాడ

కరప: మురుగు కాలువల్లో పెరిగిన గుర్రపుడెక్క, తూటుకాడ అన్నదాతల పాలిట శాపంగా మారింది. డ్రైన్లలో గుర్రపుడెక్క పెరిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ గుర్రపుడెక్క తొలగించకపోతే ఈ ఏడాది సార్వా సీజన్‌లో తుపాన్లు, అధిక వర్షాలకు వచ్చే ముంపునీరు లాగక పంట పొలాలు ముంపునకు గురయ్యే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అనుభవాల దష్ట్యా వర్షాకాలం ప్రారంభంలో వచ్చే వర్షాలే కాకుండా, అక్టోబర్, నవంబర్‌లలో వచ్చే తుపాన్లు, అధిక వర్షాలకు తొలకరి పంట ఎలా ఉంటుందోనని రైతులు మదన పడుతున్నారు.

ముంపు నీరు వస్తే..

వ్యవసాయానికి మురుగు కాలువలే కీలకంగా ఉంటాయి. మళ్లలోని మురికినీరు దింపుకోవడానికి, ముంపునీరు బయటకు పంపడానికి మురుగు కాలువల గుండానే నీరు ప్రవహించి, సముద్రంలో కలుస్తుంది. అటువంటి వాటిని నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని భూములన్నీ కాలువ శివారున, సముద్రతీరాన ఉన్నాయి. సుమారు 15 వేల ఎకరాలు సాగు జరుగుతుంది. కరప మండలానికి పై నుంచి అయిదారు మండలాల్లోని ముంపునీరు వచ్చి మురుగు కాలువల ద్వారా సముద్రంలో కలుస్తాయి. చిన్నపాటి వర్షం వచ్చినా అందరితో పాటు పంటపొలాలు ముంపునకు గురవుతాయి. పై మండలాల నీరు వచ్చి చేరడం వల్ల మళ్లీ రెండోసారి మునిగిపోతాయి. అందరికీ నాలుగైదు రోజుల్లో ముంపు నీరు లాగితే మండల పరిధిలో పంట పొలాలు వారం పది రోజులైనా ముంపు నుంచి బయట పడవు. మురుగు కాలువలు అధ్వానంగా తయారైనా పట్టించుకోని అధికారుల తీరుకు రైతుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. మురుగు కాలువల్లో గుర్రపుడెక్క తొలగించకపోతే ఖరీఫ్ పంటపై ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రబీలో తొలగించినా...

మండలంలో ప్రధానంగా జెడ్.భావారం, శహపురం, కూరాడ, పాతర్లగడ్డ డ్రైన్లు, వెంకటప్పయ్య డ్రెయిన్, జి.భావారం, రాజు డ్రైన్లు ఉన్నాయి. ఈ డ్రైన్లు అన్నీ కూడా గొర్రిపూడి వద్ద తుల్యభాగ డ్రైన్‌లో కలుస్తాయి. అక్కడ నుంచి పటవల వద్ద సముద్రంలో కలుస్తాయి. రబీ సీజన్‌లో గుర్రపుడెక్క తొలగించినా కూడా మళ్లీ అన్ని డ్రైన్లలో గుర్రపుడెక్క, తూటుకాడ అడవిలా పెరిగిపోయింది. పెరిగిన గుర్రపుడెక్క తొలగించకపోతే పొలాల్లోని మురికినీరు, ముంపునీరు లాగదని రైతులు అంటున్నారు. డ్రైన్లలో పెరిగిన గుర్రపుడెక్క, తూటుకాడను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకున్నాం

మండల పరిధిలోని డ్రెయిన్లలో పెరిగిన గుర్రపు డెక్క తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కాకినాడరూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు గుర్రపు డెక్క తొలగింపునకు రూ. 41 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. టెండర్లు ఖరారైన వెంటనే గుర్రపుడెక్క తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

– కె.కీర్తి, డ్రెయినేజీశాఖ ఏఈఈ, కరప మండలం

గుర్రపు డెక్క తొలగించాలి



మురుగుకాలువల్లో గుర్రపుడెక్క, తూటుకాడ అడవిలా పెరిగిపోయింది. తుపాన్లు వచ్చినా, అధిక వర్షాలు పడినా నీరులాగకపోతే తొలకరి సీజన్‌లో పంటపొలాలు మునిగిపోతాయి. పెరిగిన గుర్రపుడెక్క తొలగించకపోతే ముంపు తప్పేటట్టులేదు. అధికారులు స్పందించి గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– మార్నెళ్ల వెంకటరమణ, కౌలురైతు, యండమూరు

పంట నష్టపోతాం



డ్రెయిన్‌లో డ్రెయిన్‌లో తూటుకాడ, గుర్రపుడెక్క దట్టంగా పెరిగిపోయింది. కూరాడ డ్రెయిన్‌లో గుర్రపు డెక్క తొలగించకపోతే వర్షపు నీరు లాగక సార్వా పంట మునిగిపోయి, నష్టపోతాం. డ్రెయిన్లలో పెరిగిన తూటుకాడను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– వెలుగుబంట్ల సురేష్, రైతు, కూరాడ

అభ్యర్థులను అభినందించిన కలెక్టర్



అభ్యర్థులను అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: వికాస ద్వారా తిరుపతి జిల్లా రేణిగుంటలోని డిక్సాన్ టెక్నాలజీ కంపెనీలో 73 మంది అభ్యర్థులు టెక్నీషియన్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. వీరు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిసి తాము డిక్సాన్ టెక్నాలజీ కంపెనీలో ఉద్యోగానికి వికాస ద్వారా ఎంపికైనట్టు వివరించారు. వీరికి నెలకు రూ.15 వేలు జీతంతో పాటు భోజనం, రవాణా, అటెండెన్స్, బోనస్‌లు కూడా కల్పిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు వివరించారు. టెక్నాలజీ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులను కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, వికాస సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించి జేసీ

కాకినాడ సిటీ: తూరంగి గ్రామ సచివాలయాలన్ని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ సోమవారం సందర్శించారు. గ్రామ సచివాలయ స్థాయిలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆమె పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రిజిస్ట్రేషన్ సేవలను ప్రజలకు అందించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జేసీ ఇలక్కియ ఆదేశించారు. కాకినాడ జిల్లాలో 121 గ్రామాల్లోని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, రిజిస్ట్రేషన్ కోసం ఎవరూ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లనవసరం లేదన్నారు. ప్రజలు సచివాలయాలను సద్వినియోగం చేయాలన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు



గంగనాపల్లిలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను పేదలకు అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాకినాడ రూరల్ మండలం గంగనాపల్లి సచివాలయం–2 పరిధిలోని చైతన్యనగర్‌లో సోమవారం సాయంత్రం ఆయన పర్యటించారు. గ్రామ సర్పంచ్ గీసాల మహాలక్ష్మి, జగనన్న సచివాలయాల మండల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పథకాలని వివరించి, ప్రజలు పొందిన లబ్ధిని తెలియజేశారు. అనంతరం గ్రామంలో సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ నాలుగేళ్లగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ పథకాల సొమ్ములను జమ చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అవినీతికి తావులేకుండా సంక్షేమం అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించిన సచివాలయాల పరిధిలో ప్రభుత్వం అందజేస్తున్న రూ.20 లక్షల నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. గ్రామస్థుల నుంచి వచ్చిన విన్నపాలకు అత్యధిక ప్రాధ్యానతనిచ్చి వాటి పరిష్కారానికి అధికారుల ద్వారా చొరవ తీసుకుంటున్నామన్నారు. ఎంపీటీసీలు వాసంశెట్టి సత్యవేణి, చవ్వాకుల గనిలక్ష్మి, ఉపసర్పంచ్ ముమ్మిడి సుభాష్, వైఎస్సార్ సీపీ నాయకులు గోపిశెట్టి బాబ్జి, తోటకూర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ గృహలక్ష్మి కావాలన్నదే లక్ష్యం

- కాకినాడ ఎంపీ వంగా గీత
- పటవలలో ఇళ్ల పట్టాల అందజేత
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి



పట్టాల పంపిణీలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత. చిత్రంలో ఎమ్మెల్యే ద్వారంపూడి, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ తదితరులు

కాకినాడ: ప్రతి మహిళకు సొంతింటి కల నెరవేరి గృహలక్ష్మి కావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని కాకినాడ ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురంలోని 20, 21, 22, 23, 24, 27 డివిజన్లకు చెందిన సుమారు 1550 మందికి పటవలలో ఇళ్ల పట్టాల అందజేత కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ముఖ్య అతిథులుగా హాజరై ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు స్థలాలు అప్పగించి పట్టాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ రాష్ట్రంలో 34 లక్షల మందికి ఇళ్లు ఇచ్చే మహాయజ్ఞాన్ని ముఖ్యమంత్రి జగన్ చేపట్టారన్నారు. ఇందు కోసం వేలాది ఎకరాల ప్రైవేటు స్థలాలను సైతం సేకరించి అక్కడ అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారన్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఒక్క కాకినాడ సిటీ నియోజకవర్గంలో 650 ఎకరాల్లో 33 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని, ఇప్పటికే 10 వేలకు పైగా ఇళ్ల నిర్మాణం కూడా ప్రారంభమైందన్నారు. పేదల సొంతింటి కల సాకారాన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు ఆ స్థలాలను శ్మశానాలతో పోలుస్తున్నారంటూ మండిపడ్డారు. ఇటువంటి నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ కాకినాడలో 33వేల పట్టాలకు గాను, ఇప్పటికే 29 వేల మందికి ఇళ్ల స్థలాలు చూపించామన్నారు. ఈ కార్యక్రమంలో కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా మహిళాధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ కార్పొరేటర్లు రోకళ్ళ సత్యనారాయణ, సుజాత, శైలజ, దుర్గాప్రసాద్, మాజీ కార్పొరేటర్ మల్లేశ్వరరావు, రమణ, టీపీఆర్వో కృష్ణమోహన్ పాల్గొన్నారు.

డయల్ యువర్ కమిషనర్

కాకినాడ: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకూ వివిధ ప్రాంతాల నుంచి ఏడుగురు వివిధ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వీటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, స్మార్ట్‌సిటీ ఈఈ వెంకట్రావు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన స్పందన కార్యక్రమంలో 11 మంది వివిధ అంశాలపై వినతులు అందజేశారు.

13 మంది అరెస్టు

కాకినాడ క్రైం: సారా విక్రయాలు, పేకాట స్థావరాలపై సెబ్ పోలీసులు సోమవారం చేసిన దాడుల్లో 13 మంది నిందితులను అదుపు తీసుకొని, 8 కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుల నుంచి 45 లీటర్ల సారా, 12 లీటర్ల అక్రమ మద్యం, 52 క్రెడిట్, డెబిట్ కార్డులు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకొని, 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు.

పవన్ హుందాగా వ్యవహరించాలి

కాకినాడ: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ హుందాగా వ్యవహరించాలని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి సోమవారం విలేకరుల సమావేశంలో అన్నారు. వారాహియాత్రలో భాగంగా కాకినాడ బహిరంగ సభలో ఆదివారం పవన్ కల్యాణ్ రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేశారన్నారు. శాసనసభలో చట్టాలు చేసే ఎమ్మెల్యేను పట్టుకుని దూషించడం సబబుకాదన్నారు. ఎవరైనా తప్పులు చేస్తే ఆధారాలు ఉంటే న్యాయస్థానానికి వెళ్లాలి, లేదంటే బ్యాలెట్ యుద్ధంలో తేల్చుకోవాలన్నారు. సినీ డైలాగులు మంచివి కాదన్నారు. రాష్ట్రంలో క్రైం, మహిళలు దాడులు, అత్యాచారాలు గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. గత టీడీపీ హయాంలో కేసులు గురించి ఎందుకు ఆయన మాట్లాడరన్నారు.

అల్లూరి జయంతిని అధికారికంగా నిర్వహించాలి

కాకినాడ సిటీ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి జులై 4న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీ కమిటీలు సంయుక్తంగా సోమవారం కలెక్టర్ కృతికా శుక్లా, ఆర్డీవో ఎన్‌వీవీ సత్యనారాయణలను కలసి వినతి పత్రాలు అందజేశారు.

సమన్వయంతోనే మెరుగైన సేవలు

- కమిషనర్ల సంఘ అధ్యక్షుడు నాగనరసింహారావు
- కార్పొరేషన్ అధికారుల ఘన సత్కారం



నాగనరసింహారావును సత్కరిస్తున్న నగరపాలక సంస్థ అధికారులు

కాకినాడ: అన్ని విభాగాలూ సమన్వయంతో సమష్టిగా పని చేస్తే ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించగలమని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఆయనను సోమవారం నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల అధికారులు కలిసి అభినందించి సత్కరించారు. నాగనరసింహారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వివిధ విభాగాలు, వాటికి అనుబంధంగా అసోసియేషన్లు ఉన్నాయని, వీరందరినీ సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎస్ఈ సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, ఏవో శిరీష్, రాష్ట్ర శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సత్తెప్పనాయుడు ఆయనను అభినందించారు.

అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో జిల్లా అనుబంధ విభాగాలకు నూతన అధ్యక్షులను నియమించారు. కాకినాడ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పూసల అనిల్(కాకినాడ రూరల్), జిల్లా వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా పినపోతు జీవరత్నం(కాకినాడ సిటీ), డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.టి.సెల్ అధ్యక్షుడిగా తోరం గౌతమ్‌రామ్(పి.గన్నవరం), జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా సూరిశెట్టిబాబు(రాజోలు) నియమితులయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా ఉచ్చుల స్టాలిన్‌బాబు(పాలకొల్లు)లను నియమించారు.

అనుబంధ విభాగాలకు జోనల్ ఇన్‌చార్జిలు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఉభయ గోదావరి జిల్లాల ఎస్సీసెల్, క్రిష్టియన్ మైనార్టీసెల్, ఎస్టీసెల్ విభాగాలకు సోమవారం జోనల్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో వీరి నియామకాలను ప్రకటించారు. ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జిగా గుల్ల ఏడుకొండ (కాకినాడ జిల్లా), క్రిస్టియన్ మైనార్టీసెల్ జోనల్ ఇన్‌చార్జ్‌గా జాన్‌వెస్లీ (కాకినాడ జిల్లా), ఎస్టీసెల్ జోనల్ ఇన్‌చార్జ్‌గా మొడియం రామతులసి(ఏలూరు జిల్లా) లను నియమించారు.

రెండో ఎంఈఓగా సత్యనారాయణ

కరప: స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం మండల విద్యాశాఖాధికారి–2(ఎంఈఓ–2)గా పత్తి సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లి హైస్కూలులో గజిటెడ్ హెచ్‌ఎంగా పని చేస్తున్న సత్యనారాయణ ఆదివారం జరిగిన కౌన్సిలింగ్‌లో ఎంఈఓ–2గా ఎంపిక కాగా కరప మండలానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు అరట్లకట్ట జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పని చేసిన సత్యనారాయణ సాధారణ బదిలీల్లో కాట్రావులపల్లి హైస్కూల్‌కు వెళ్లారు. సత్యనారాయణకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

26న పోలవరంలో బహిరంగ సభ

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, దీనిపై ఈనెల 26న పోలవరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పేర్కొన్నారు. సోమవారం కాకినాడలోని పొన్నమండ రామచంద్రరావు భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సీపీఐ దశల వారీ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. అదే విధంగా అగ్రిగోల్డ్ బాధితుల కోసం 27న కాకినాడలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మధు తెలిపారు.

జూలై ఒకటి నుంచి జగనన్న సురక్ష



పథకం అమలుపై వీడియో కాన్ఫరెన్స్‌ను కార్యదర్శులు, వీఆర్వోలతో కలిసి చూస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: ప్రజాసమస్యల పరిష్కారానికి జూలై ఒకటో తేదీ నుంచి జగనన్న సురక్ష పథకం అమలు చేస్తున్నారని, అందుకు గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ కె.అప్పారావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశమై పథకం గురించి వివరించి, అనుసరించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనతో పాటు డీటీ, సీనియర్ అసిస్టెంట్ ఒకటీంగా, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ మరో టీంగా రోజుకో గ్రామ సచివాలయాలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకూ అక్కడే ఉండి, అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలు పరిష్కరిస్తారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సచివాలయ సేవలు, సంక్షేమ పథకాలు ఎవరికైనా అందకపోతే, వారితో వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేయించి, వాటి పరిష్కారానికి జగనన్న సురక్ష పథకం నిర్వహించేందుకు మండల పరిధిలో రెండు టీములు ఏర్పాటు చేశామన్నారు. జూలైలో ఒకటో తేదీకి వారం రోజులు ముందు గ్రామ వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు చెందిన సమస్యలను గ్రామ సచివాలయంలో తెలియజేసి, నమోదు చేస్తారన్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్ టీములు ఆయా గ్రామ సచివాలయాలకెళ్లినప్పుడు ఆ సమస్యలు పరిష్కరిస్తారన్నారు. తర్వాత జగనన్న సురక్ష పథకం అమలుపై జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీఓతోపాటు ఎంఈఓ–1 కె.బుల్లికృష్ణవేణి, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): తమ సమ్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార ఉద్యోగుల సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కాకినాడ డీసీసీబీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి పెంకె సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లోని సహకార సంఘాల్లో రైతులు మాత్రమే వాటాదారులుగా ఉండాలన్నారు. కానీ సహకార సంఘాల్లో 50 శాతం వాటాలను ప్రైవేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ 1964 చట్టానికి చేసిన సవరణను రద్దు చేయాలన్నారు. జీవో నంబర్ 36, 90ల ప్రకారం వేతనాలు అమలు చేయాలన్నారు. అనంతరం డీసీసీబీ సీఈఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ జిల్లా సంఘ అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు, కాకినాడజిల్లా అధ్యక్షుడు కడగల ఆదినారాయణ, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణపాల్గొన్నారు.

యాత్ర విజయవంతం

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): వారాహి యాత్ర విజయవంతంగా నడుస్తోందని జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ చెప్పారు. కాకినాడలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ వాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాకనే రౌడీయిజం పెరిగిపోయిందన్నారు.

సమ్మర్ క్రికెట్ టోర్నీ విజేతలు వాకాడ, గురజనాపల్లి జట్లు



నో ఏజ్‌లిమిట్ విభాగంలో టోర్నీ విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న దృశ్యం

కరప: వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో మూడు వారాల పాటు నిర్వహించిన సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. అండర్–19 విభాగంలో 12 టీములు పాల్గొనగా ఫైనల్స్‌లో వాకాడ, కూరాడ జట్లు తలపడగా వాకాడ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా మధుబాబు(వాకాడ) నిలిచాడు. నో ఏజ్ లిమిట్ విభాగంలో 44 జట్లు పోటీ పడగా ఫైనల్స్‌లో గురజనాపల్లి, పటవలజట్లు తలపడ్డాయి. ఇందులో గురజనాపల్లి జట్టు విజేతగా నిలిచింది. గోవిందరాజులు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు. టోర్నీ విజేత జట్లకు రన్నర్స్ జట్లకు, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డులను ఉపసర్పంచ్ కుంచే అయ్యన్న, చుండ్రు వెంకన్నరాయ్ చౌదరి, పెంకే శ్రీనివాసబాబా, గునిపే శోభన్‌బాబు, జి.కొండబాబు, సానా శ్రీను, ఖండవల్లి గునేశ్వరరావు, పి.వీరబాబు, చుట్టూరి అప్పన్న అందజేశారు. వేళంగి గ్యాడ్యుయేట్ యూత్ ప్రతినిధులు దేగల శ్రీనివాస్, అప్పికొండ దుర్గాప్రసాద్, చప్పిడి మూర్తి, విక్రమ్, నక్కెళ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.